www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 27 ఏప్రిల్ 2023

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

ప్రజాశక్తి-తిరుపతి సిటి ఇంటర్మీడియల్ 2023 పరీక్షా ఫలితాల్లో ఎక్కువశాతం ఉత్తీర్ణతతో బాలికలే పైచేయి సాధించారని ఆర్ఐవో తెలిపారు. బుధవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 56శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 8వస్థానం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 72శాతం ఉత్తీర్ణతతో జిల్లా 5వ స్థానంలో నిలిచిందన్నారు. ద్వితీయ సంవత్సరంలో జిల్లా నుంచి 36,028 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైతే 25783 మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో 17,678 మంది బాలురు పరీక్షలకు హాజరైతే 11744 మంది ఉత్తీర్ణత 66శాతం, బాలికలు 18350 మంది పరీక్షలకు హాజరైతే 77శాతంతో 14039 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరం పరీక్షల్లో జిల్లా నుంచి 43,713 మంది పరీక్షలకు హాజరైతే 24425 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. అందులో బాలురు 22239 మంది పరీక్షలకు హాజరైతే 11204 మంది 50 శాతంతో ఉత్తీర్ణత, బాలికలు 21474 మంది పరీక్షలకు హాజరైతే 62 శాతంతో 13221 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో బాలికలు అధికశాతం ఉత్తీర్ణత సాధించి, పైచేయి సాధించారన్నారు.

ఉపాధ్యాయులను భయపెడితే ఊరుకోం..

ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు హృదయరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం చిత్తూరు స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం వద్ద ఫ్యాప్టో నేతలు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈకార్యక్రమం ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ ఏ.మునాఫ్ అధ్యక్షతన జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర ఫ్యాప్టో నాయకులు హదయరాజు మాట్లాడుతూ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ రాష్ట్రమంతా పర్యటిస్తూ.. ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఎక్కడిక్కడ అధికారులను ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ ఉండడం సరికాదన్నారు. దీనిని ఫ్యాప్టో పక్షంగా తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రభుత్వలోపాలను ఉపాధ్యాయులపై నెట్టివేయడం సరికాదని అన్నారు. ప్రభుత్వం సకాలంలో పాఠశాలలకు పుస్తకాల పంపిణీ చేయకుండా ఆ తప్పిదాన్ని అధికారులపై ఉపాధ్యాయులపై మోపడం అన్యాయమన్నారు. ఇచ్చిన ఒక నెలలోనే జగనన్న పుస్తకాలు, బ్యాగులు చినిగిపోయాయని, అలాగే షూలు కూడా సరియైన కొలతలో రాలేదని ఈవిషయంలో ప్రవీణ్‌ప్రకాష్ ఎవరిని శిక్షిస్తారని ప్రశ్నించారు. అన్నిపనులు ఉద్యోగులతో సకాలంలో చేయించుకుంటున్న ప్రభుత్వం ఇప్పటికీ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రవీణ్ ప్రకాష్ తమ తీరు మార్చుకోవాలని లేకుంటే ఆందోళన ఉధతం చేస్తామని హెచ్చరించారు. సెక్రటరీ జనరల్ జివి.రమణ, కో ఛైర్మన్ మునీర్ అహమ్మద్, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌లు కిరణ్ కుమార్, రహ్మత్ బాషా, సీనియర్ నాయకులు జి.చెంగల్రాయ మందడి, పురుషోత్తం నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఫ్యాప్టో నేతలు

టీటీడీ గోశాలకు మేతను అందించిన జడ్పీ ఛైర్మన్

ప్రజాశక్తి- వికోట

ప్రస్తుత వేసవిలో మూగజీవాల ఆకలి తీర్చేందుకు తన వంతు సాయంగా పచ్చిమేతను అందించి తన ఉదారత్వాన్ని చాటుకున్నారు జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీనివాసులు దంపతులు. పలమనేరు సమీపంలోని క్యాటిల్‌ఫారం వద్ద టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలకు రెండు ట్రాక్టర్ లోడ్ల పచ్చిమేతను బుధవారం ఉచితంగా ఛైర్మన్ దంపతులు శ్రీనివాసులు భాగ్యలక్ష్మి అందించారు. గోశాలలో పశు గ్రాసం కొరత నెలకొన్న నేపథ్యంలో గోశాల నిర్వాహకులు అభ్యర్ధన మేరకు మరికొన్ని పచ్చిమేత ట్రాక్టర్ లోడ్లను అందించేందుకు ఛైర్మన్ దంపతులు సుముకుత వ్యక్తం చేశారు. గోశాలలోని దాదాపు 400 పశువులకు పది రోజులకు సరిపడే పచ్చి మేతను ఉచితంగా అందించిన ఛైర్మన్ దంపతులకు స్థానిక ప్రజలు కతజ్ఞతలు తెలియజేశారు.

గ్రానైట్ పై గుదిబండ

- తగ్గని కరోనా ఎఫెక్ట్
- పర్మిట్లు, కరెంట్ బిల్లుల మోత
- మూతపడుతున్న పరిశ్రమలు
- ఏజన్సీదే పెత్తనం

> ఒకప్పుడు కాసుల వర్షం కురిపించిన గ్రానైట్ పరిశ్రమ నేడు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. పారదర్శకత పేరుతో థార్డ్‌పార్టీ ఏజెన్సీ రాఘవేంద్ర కన్షెన్స్‌కు ప్రభుత్వం అప్పగించడం, పెరిగిన కరెంట్ ఛార్జీలు, కరోనా కష్టాలతో ప్రస్తుతం గ్రానైట్‌పై గుదిబండగా మారింది. దీంతో పరిశ్రమల యజమానులు నష్టాలతో నడపాల్సి వస్తోంది. సొంత క్వారీలు, ఫ్యాక్టరీలున్న వారు ఎలాగో నెట్టుకొస్తుంటే... ఫ్యాక్టరీలు లీజుకు తీసుకొని క్వారీ నుండీ గ్రానైట్ దిమ్మెలు కొనుగోలు చేసి వాటిని స్లాబ్‌లుగా కోసి విక్రయించేవారి పరిస్థితి మాత్రం అత్యంత దయనీయంగా మారింది. కనీసం ఖర్చులు సైతం రాకపోవడంతో ఫ్యాక్టలను మూసివేసే పరిస్థితి నెలకొంది.

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

మూడేళ్ళ కాలంలో జిల్లాలో 20 నుంచి 25 గ్రానైట్ ఫ్యాక్టరీ మూతపడ్డాయి. ఇదే పరిస్థితి కొనసాగితే గ్రానైట్ పరిశ్రమ తీవ్రనష్టాల్లో కూరుకుపోయి మూసివేయక తప్పదని గ్రానైట్ పరిశ్రమ యజమానులు చెబుతున్నారు. పాదయాత్ర సందర్భంగా ఒంగోలు సభలో నేటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రానైట్ పరిశ్రమలను ఆదుకుంటామని, విద్యుత్ ఛార్జీలో రాయితీలిస్తామని ప్రకటించినా ఆచరణ సాధ్యం కాకపోవగా పెరిగిన విద్యుత్ ఛార్జీలు, సెస్స్, ట్రూఆఫ్ ఛార్జీల పేరుతో గ్రానైట్ పరిశ్రమల విద్యుత్ బిల్లులు తడిసిమోపెడవుతోందని గ్రానైట్ పరిశ్రమల యజమానులు విలవిలాడుతున్నారు. మరోవైపు జిల్లాలో లభ్యమవుతున్న గ్రానైట్‌లో జి.20 మినహా ఇతర గ్రానైట్ స్లాబ్‌లు ఎగుమతులు చేసేందుకు వీలుకాకపోవడంతో స్థానికంగా అమ్ముకోవాల్సి రావడంతో ఏ గ్రానైట్ ఫ్యాక్టరీలో చూసిన గుట్టలు గుట్టలు అమ్ముడుపోక గ్రానైట్ స్లాబ్‌లు దర్శనమిస్తున్నాయి.

ఏజన్సీదే పెత్తనం...

ఒక్కప్పుడు అంటే నాలుగేళ్ల క్రితం గ్రానైట్ పరిశ్రమలకు అవసరమై గ్రానైట్ దిమ్మెలను ఫ్యాక్టరీ యజమాని క్వారీలకు వెళ్లి ఏ సైజు దిమ్మెకావాలో ఎంచుకొని ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుజుము చెల్లించి ఫ్యాక్టరీకి తొలుకొనేవాడు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. క్వారీల నుండీ దిమ్మెలను ఫ్యాక్టరీలకు తీసుకుపోవాలంటే థార్డ్‌పార్టీ ఏజెన్సీ కొలతల ప్రకారం ప్రభుత్వానికి రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో రాఘవేంద్ర కన్షెన్స్‌కు అప్పగించింది ఈ సంస్థ ఓ మాజీ ప్రజాప్రతినిధికి చెందింది. ఇందులో 150 మంది సిబ్బంది పని చేస్తున్నారు. ఏ ఫ్యాక్టరీకి గ్రానైట్ దిమ్మె కావాలన్నా ఈ ఏజేన్సీకి ముందుగా తెలపాలి. దిమ్మె సైజును బట్టి ప్రభుత్వానికి ఎంత చెల్లించాలో వారే నిర్ణయిస్తారు. ఇష్టానుసారం కొలతలు తీస్తూ ఫ్యాక్టరీ యజమానులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్రమంగా గ్రానైట్ దిమ్మెలు ఫ్యాక్టరీలకు తరలించకుండా జిల్లాలోని క్వారీలకు వేళ్ళేదార్లతో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. పర్మిట్లు, గ్రానైట్ దిమ్మెల కొలతలు ఇతర పనులన్నీ ఏజేన్సీకి అప్పగించడంతో మైనింగ్‌శాఖ అధికారులు కార్యాలయానికే పరిమితం కావాల్సి వస్తోంది.

నష్టాలతో చిత్తూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో మూతపడ్డ గ్రానైట్ పరిశ్రమ

కరోనా ఎఫెక్ట్...

అన్ని పరిశ్రమలపై ప్రభావం చూపిన కరోనా ఎఫెక్ట్ గ్రానైట్ పరిశ్రమపై కూడా పడింది. కరోనా సమయంలో దాదాపు 20 రోజులకు పైగా ఫ్యాక్టరీలను మూసివేశారు. ఆ కాలంలో కూడా ఫ్యాక్టరీ యజమానులు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వచ్చింది. కరోనా సమయంలో ఇతర రాష్ట్రాల నుండీ వచ్చిన కార్మికులు తమ సొంతరాష్ట్రాలకు వెళ్లిపోయి తిరిగీ రాకపోవడం కార్మికుల కొరత ఏర్పడింది. గ్రానైట్ పరిశ్రమలో పనిచేసే స్కిల్ వర్కర్లు మన రాష్ట్రంలో తక్కువ ఇతర రాష్ట్రాల కార్మికులే అధికంగా పనిచేస్తుంటారు. మరోవైపు కరెంట్ ఛార్జీలు పెంచడం భారంగా మారుతోంది. తమిళనాడు, తెలంగాణాలో గ్రానైట్ పరిశ్రమలకు విద్యుత్ రాయితీల్విడంతో గ్రానైట్ పరిశ్రమ పరిస్థితి మెరుగ్గా ఉంది. మన రాష్ట్రంలో గతంలో సెస్స్ 4 పైసలుంటే దాన్ని ఒక్క రూపాయికి పెంచారు. విద్యుత్ యూనిట్ రూ.700 నుండీ 800లకు పెరిగింది. ట్రూ ఆఫ్ ఛార్జీల భరించాల్సి వస్తోంది. రెండు బ్లేడ్లు ఉన్న గ్రానైట్ పరిశ్రమకు నెలకు లక్షా 15వేలు వస్తే, ఆదే తమళనాడులో అయితే 20 నుంచి 25 వేలు విద్యుత్ బిల్లు తగ్గుతుందన్న మాట.

నష్టం ఇలా...

క్వారీ నుండీ గ్రానైట్ దిమ్మను ఫ్యాక్టరీకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయాల్టి చెల్లించి చేర్చడం, దాన్ని బ్లేడుపైకి ఎక్కించి అరలు, అరలుగా (స్లాబులు) కట్ చేసి పాలిస్ చేస్తే ఫ్యాక్టరీ గేటు దాటక ముందే అంటే ఫ్యాక్టరీలోనే అడుగు గ్రానైట్ స్లాబ్ రూ.52 నుంచి 55ల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. బహిరంగ మార్కెట్‌లో అడుగు గ్రానైట్ స్లాబ్ రూ.55 నుంచి 60లలోపే అమ్ముడుపోతోంది. కొన్ని రకాలు క్వాలిటీని బట్టి రూ.70 నుంచి 75ల వరకు విక్రయిస్తున్నప్పటికీ ఫ్యాక్టరీ యజమానులకు ఏ మాత్రం గిట్టబాటు కావడం లేదు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 150బేడ్లు అంటే సరాసరి 700లవరకు గ్రానైట్ పరిశ్రమలు చిత్తూరు, కుప్పం, పుంగనూరు, మదనపల్లి ప్రాంతాల్లో ఉన్నాయి. ఈప్రాంతాల్లోనే క్వారీలకు అనుమతులున్నాయి. అత్యధికంగా చిత్తూరు పరిసర ప్రాంతాలైన చిత్తూరు, గుడిపాల, యాదమరి, పెనుమూరు, తవణంపల్లి ఈ ప్రాంతాల్లోనే గ్రానైట్ పరిశ్రమలు నడుస్తున్నాయి. ఒక్కో ఫ్యాక్టరీలో 10 నుంచి 15 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఈ లెక్కన జిల్లాలో గ్రానైట్ పరిశ్రమల్లో 10వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. నేటి పరిస్థితులో కొంతకాలం కొనసాగితే గ్రానైట్ పరిశ్రమలు మూతపడి కార్మికులు ఉపాధి కొల్పోవడంతో పాటు గ్రానైట్ పరిశ్రమల నుండీ ప్రభుత్వానికి నెలకు వచ్చే ఆదాయంలో కోట్లలో గండిపడే పరిస్థితి తప్పదని గ్రానైట్ పరిశ్రమల యజమానులు చెబుతున్నారు. విద్యుత్ రాయితీలతో పాటు గ్రానైట్ పరిశ్రమలను బ్రతికించేలా ప్రభుత్వం పర్మిట్ల మంజూరులో సడలింపులు ఇవ్వాలని కోరుతున్నారు.

దళిత వాడలలో

శ్మశానవాటికల ఏర్పాటుకు ప్రాధాన్యత

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వం దళితవాడలలో శ్మశాన వాటికల ఏర్పాటుకు అధికప్రాధాన్యత ఇస్తున్నదని ఉపముఖ్యమంత్రి కె.నారాయణస్వామి పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో ఉప ముఖ్యమంత్రి, చిత్తూరు ఎంపి ఎన్.రెడ్డప్ప, కలెక్టర్ సగిలి షన్మోహన్, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులుతో కలసి జీడీనెల్లూరు నియోజకవర్గ పరిధిలోని మండలాల తహసీల్దార్లతో రెవెన్యూ సంబంధింత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం దళిత వాడలలో శ్మశాన వాటికల ఏర్పాటుకు అధికప్రాధాన్యత ఇస్తున్నదని, ఈనిర్ణయం చారిత్రాత్మకమనన్నారు. అర్హులకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా అందజేయడంలో అధికారులు కషి చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనియోజకవర్గ పరిధిలోని రెవెన్యూ సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేకదష్టి పెట్టి పనిచేయాలని తెలిపారు. దళిత వాడలలో శ్మశాన వాటికల ఏర్పాటుకు ఇది వరకు గుర్తించిన భూమికి హద్దులు నిర్ణయించి ఈప్రక్రియ త్వరగా పూర్తిచేయాలన్నారు. రీసర్వే ప్రక్రియ వేగవంతం చేసేందుకు అదనపు సిబ్బంది నియామకం చేపట్టాలని అన్నారు. అలాగే స్పందన కార్యక్రమంలో అందిన అర్జీల పరిష్కారంపై శ్రద్ధపెట్టాలన్నారు.

నేతన్నలకు విద్యుత్ సబ్సిడీ గురించి

సిఎంతో చర్చిస్తాం : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు అభివద్ధి, సంక్షేమ పథకాలను సమాన స్థాయిలో అమలు చేసి, ఆ పథకాలను వారి ఇంటి వద్దకే చేరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఉపముఖ్యమంత్రి, ఎక్సైజ్ శాఖ మంత్రి కె.నారాయణస్వామి తెలిపారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని పెనుమూరులో రెండు గ్రామాలలో ఉన్న నేతన్నల కోసం ఒక క్లస్టర్ తీసుకొచ్చిన సందర్భంగా వారికి అవగాహన కల్పించడంతోపాటు పరికరాలను అంద జేసేందుకు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చేపడుతున్న కార్యక్రమాలు దేశ విదేశాలలో ప్రశంసలు పొందుతున్నాయని, చేపడుతున్న కార్యక్రమాలు కుల, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి వద్దకే అందిస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. అన్ని వర్గాలతో పాటు చేనేతలకు కూడా ఒక పెనుమూరు మండలంలోని రెండు గ్రామాలను ఒక క్లస్టర్ గా ఏర్పాటు చేయడంతో పాటు ఆ క్లస్టర్ కోసం రూ.1.5 కోట్లు వెచ్చించడం ఎంతగానో అభినందించదగ్గ విషయమనన్నారు. మండలంలోని గొడుగుమానుపల్లి, గుడియానంపల్లి గ్రామాలకు చెందిన నేతన్నలకు ఒక క్లస్టర్ ఏర్పాటు చేశారు. ఈ క్లస్టర్ కు సంబంధించి మొదటి విడతలో చేతితో బట్టలు తయారు చేసే మగ్గాలు రూ.60వేల విలువైనవి 50 మందికి ఇవ్వనున్న మగ్గాలను పంపిణీ చేశారు. రానున్న కాలంలో మరింత మందికి అందించడం జరుగుతుందని, మొత్తం ప్రాజెక్టు విలువ రూ.1.04కోట్లు అన్నారు. ప్రస్తుతం 50 మందికి చేతితో తయారు చేసే చేనేత యంత్రాలను ఇవ్వడం జరుగుతుందని, ఒక్కొక్కటి రూ. 1.20 లక్షలతో మరో 12 మందికి వర్క్ షెడ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. వీటిని త్వరలో ప్రారంభించనున్నారని, మరో 13మందికి త్వరలో ఇవ్వడం జరుగుతుందని అన్నారు. గుడియానంపల్లిలో సామాజిక వనరుల కేంద్రంను త్వరలో మంజూరు చేయించడం జరుగుతుందని అన్నారు. దీనికి మరో 30లక్షల రూపాయలు ఇప్పించడం జరుగుతుందని ఉపముఖ్యమంత్రి ప్రకటించారు. అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్రాం, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కమలాకర్ రెడ్డి, అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వసతి దీవెన లబ్ధిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

తల్లుల ఖాతాల్లో రూ.33.29 కోట్లు జమ

కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సగలి షన్మోహన్

వివిధ శాఖల వారీగా జగనన్న వసతి దీవెన మంజూరు

సాంఘిక సంక్షేమశాఖ
విద్యార్థుల సంఖ్య: 7,615
తల్లులసంఖ్య: 6,883
మొత్తం రూ.7,33,37,500

గిరిజన శాఖ
విద్యార్థుల సంఖ్య: 645
తల్లులసంఖ్య: 592
మొత్తము రూ.62,22,500

వెనుకబడిన తరగతుల శాఖ
విద్యార్థుల సంఖ్య: 15,417
తల్లుల సంఖ్య: 13,771
మొత్తము రూ.15,04,37,500

ఆర్థికంగా వెనుకబడిన తరగతులు
విద్యార్థుల సంఖ్య: 4,732
తల్లుల సంఖ్య: 4,369
మొత్తము రూ.4,68,95,000

ముస్లిం మైనార్టీ
విద్యార్థుల సంఖ్య : 2,309
తల్లుల సంఖ్య: 2,097
మొత్తము రూ.2,26,20,000

కాపు
విద్యార్థుల సంఖ్య : 3,368
తల్లులసంఖ్య: 3,155
మొత్తము రూ. 3,29,62,500

క్రిస్టియన్ మైనార్టీ
విద్యార్థుల సంఖ్య: 47
తల్లుల సంఖ్య: 45
మొత్తము రూ. 4,60,000

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విద్యార్థులు వసతి దీవెన ద్వారా వారి తల్లిదండ్రుల ఖాతాలకు ప్రభుత్వం జమ చేసిన నగదును సద్వినియోగపరచుకోవడం విద్యార్థులు తమ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు. బుధవారం అనంతపురం జిల్లా నార్పాల నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న వసతి దీవెన కార్యక్రమానికి చెందిన ఆర్థిక లబ్ధిని కంప్యూటర్‌లో బటన్‌నొక్కి ప్రారంభించారు. జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో వర్చువల్ విధానంలో కార్యక్రమాన్ని వీక్షించే ఏర్పాటు చేశారు. ఈ జిల్లాస్థాయి కార్యక్రమానికి చిత్తూరు ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు, నగర మేయర్ అముద, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, జడ్పీ వైస్‌ఛైర్మన్ రమ్య, రాష్ట్ర పాలఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ మురళీధర్, సాంఘిక సంక్షేమశాఖ డిడి రాజ్యలక్ష్మి, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ చిన్నారెడ్డి, గిరిజన సంక్షేమ అధికారి మూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిపథకం లబ్ధిని డిబిటి ద్వారా లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమచేయడం జరుగుతున్నదని తెలిపారు. లబ్ధిదారులకు నగదు జమచేసే ప్రక్రియలో ఆధార్ ముఖ్య భూమిక పోషించడం జరుగుతుందని, దీని ద్వారా ఎటువంటి లోటుపాట్లు లేకుండా లబ్ధిదారులకు పథకాల ఫలం అందుతుందని తెలిపారు. జిల్లాలోని 34,133 మంది విద్యార్థులకు చెందిన 30,912 మంది తల్లిదండ్రుల ఖాతాలకు రూ.33.29 కోట్లు నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి జమ చేయడం జరిగిందని తెలిపారు. మేయర్ మాట్లాడుతూ తల్లిదండ్రులకు వారి పిల్లల విద్య ఆర్థికంగా భారం కాకూడదనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన పథకాలను ప్రవేశ పెట్టారని తెలిపారు. విద్యను విద్యార్థులకు ముఖ్యమంత్రి ఆస్తిగా అందిస్తున్నారని, విద్యార్థులు బాగా చదువుకుని ప్రయోజకులు కావాలని తెలిపారు. అనంతరం మెగా చెక్కును అతిథుల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.

ప్రజల ఆర్థిక పరిపుష్టికి

రుణాలు మంజూరు చేయండి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆర్థిక పరిపుష్టికి వివిధ పథకాలకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసేలా కషి చేస్తున్నదని జిల్లాకలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎల్‌డిఎం, వ్యవసాయ అనుబంధ శాఖలు, డిఆర్డిఏ, మెప్మా డిసిసిబి, సంబంధిత శాఖల అధికారులతో కలసి వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాల అమలు తీరు, అందుకు బ్యాంకుల సహకారం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధశాఖల ద్వారా అమలవుతున్న పథకాలకు బ్యాంకర్ల అందిస్తున్న సహకారం ద్వారా ప్రజల ఆర్థిక పరిపుష్టిని సాధించేందుకు అవకాశం ఉందని అన్నారు. ఇందులో భాగంగా బ్యాంకర్ల ద్వారా లబ్ధిపొందిన వారు రుణాలను తిరిగి చెల్లించేలా కషి చేయాలని అధికారులకు సూచించారు. ఇందులో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ, పీఎం స్వనిధి, జగనన్న తోడు పీఎంఈజీపి, పిఎం ఎఫ్‌ఎంఈ, స్టాండప్ ఇండియా, జన సురక్ష క్యాంపెయిన్ తదితర పథకాల అమలు తీరును చర్చించారు. ఎల్‌డిఎం శేషగిరిరావు, వ్యవసాయ ఉద్యానవన, పశుసంవర్ధక శాఖల అధికారులు మురళీధర్, మధుసూదన్ రెడ్డి, ప్రభాకర్, డిఆర్డిఏ మెప్మా పీడీలు తులసి, రాధమ్మ, చిత్తూరు మున్సిపల్ కమిషనర్ అరుణ, జిఎండిఐసి చంద్రశేఖర్, డిసిసిబి సీఈఓ మనోహర్ గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రాణం తీస్తున్న కరెంటు తీగలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

అటవీ సమీప గ్రామాల్లోని రైతులు అడవి జంతువుల భారి నుంచి తమ పంటలను కాపాడుకోవడం కోసం పంటపొలాల చూట్టూ కరెంటు తీగలు ఏర్పాటు చేస్తున్నారు. చీకటి అటుగా వస్తున్న రైతులు, ప్రజలు ఇది తెలీక కరెంట్ తీగలు తగిలి తరచూ మరణిస్తూనే ఉన్నారు.

మూడురోజుల క్రితం తవణంపల్లిలో కరెంట్ షాక్‌తో మరణించిన రైతు (ఫైల్‌ఫొటో)

జిల్లాలోని అటవీ సమీపంలోని రైతన్నలు ఎక్కువ మంది అడవి పందుల భారి నుంచి పంటలను కాపాడుకోవడాని పొలం చూటూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి దానికి మోటరు నుంచి కానీ అక్రమంగా కరెంట్ పోల్ నుంచి గానీ కన్షెన్ ఇస్తున్నారు. అలాగే కొంతమంది వేటగాళ్లు రాత్రిపూట అడవి జంతువులను వేటాడటానికి పొలాలకు దగ్గరలోని 11కెవి కరెంటు వైర్ల నుంచి అక్రమంగా విద్యుత్ చోరీ చేసి ఇనుప తీగలకు కనెక్ట్ చేస్తున్నారు. ఇది తెలియని వారు అటుగా వచ్చి కరెంట్ షాక్‌కు గురై కొందరు ప్రాణాలు పోగొట్టుకుంటే, మరికొందరు తీవ్రగాయాలకు గురైతున్నారు.

మూడు రోజుల క్రితం తవణంపల్లి మండలం బోయపల్లికి చెందిన ఓ రైతు మేఘనాథం (39) రాత్రి సమయంలో తన పాడి ఆవును వెతుకుంటూ వెళ్లి పొలానికి ఏర్పాటు చేసిన కరెంట్ తీగలు తగిలి అక్కడిక్కడే మరణించాడు. ఇటువంటి ఘటనలు ఒక్క తవణంపల్లి మండలంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఈమధ్యనే చౌడేపల్లి మండలం శెట్టిపేట పంచాయతీలోని ఎర్రగంగన్నపల్లి గ్రామంలో కొండూరు వెంకటరాజు తన పొలం చుట్టూ అమర్చిన కరెంట్ తీగలకు కూలి పనికోసం రామసముద్రం మండలం, మాలేనత్తమ్ గ్రామం నుండి వచ్చిన మునేంద్ర, బీరమ్మ అనే భార్యాభర్తలు ఇద్దరూ విద్యుదాఘాతంతో మతి చెందారు. దీంతో విద్యుత్ తీగలను అమర్చిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఇలా పొలాల్లో అక్రమంగా విద్యుత్ తీగలు అమర్చించి అమాయకులు ప్రాణాలు పోవడానికి కారణమైన వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. గత ఐదేళ్లుగా పలమనేరు సబ్-డివిజన్ పరిధిలో సుమారు 12మంది అమాయకులు కరెంట్ షాక్‌తో ప్రాణాలు కొల్పోయారు. 2018 సంవత్సరంలో సోమల మండలంలో ఒకరు, 2019 సంవత్సరంలో ఇద్దరు, రామకుప్పం మండలంలో ఒకరు, 2020 సంవత్సరంలో సోమల మండలంలో ఒకరు, కుప్పం మండలంలో ఒకరు, బంగారుపాళ్యం మండలంలో ఒకరు, రామకుప్పం మండలంలో ఒకరు, 2021 సంవత్సరంలో గుడిపల్లి మండలంలో ఒకరు, సోమల మండలంలో ఒకరు, 2023 సంవత్సరంలో ఇప్పటి వరకు చౌడేపల్లి మండలంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఇలా జిల్లా వ్యాప్తంగా పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తాకి అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు.

కఠిన చర్యలు తప్పవు

శ్రీనివాసమూర్తి , చిత్తూరు డిఎస్‌పి



పంట పొలాలలో విద్యుత్ తీగలు అమర్చినా వాటి వల్ల ఏవరైనా గాయపడిన, మరణించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చిత్తూరు డిఎస్‌పి శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈమధ్య కాలంలో చిత్తూరు జిల్లాలో కొంత మంది వేటగాళ్ళు పంట పొలాలలో అడవి పందులను, ఇతర అడవి జంతువులను వేటాడానికి విద్యుత్ తీగలను అమర్చుతున్నారు. దీనివలన రాత్రి సమయంలో పంటపొలాలకు వెళ్ళే రైతులు కరెంటు తీగలకు తగిలి అకాల మరణం చెందుతున్నారు. ఈ విషయమై పంట పొలాలలో ఎవరైనా విద్యుత్ తీగలు అమర్చిన, వాటి వలన ఎవరైనా గాయపడిన లేదా మరణించిన, వారిపై 304 (11) ఐపిసి సెక్షన్ కింద చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు రౌడీ షీట్స్ తెరుస్తామని డీఎస్పీ హెచ్చరించారు. ఎవరైనా విద్యుత్ తీగలు అమరిస్తే పంట పొలాలకు ఇరువైపులా రాత్రి సమయంలో కనబడే విధంగా సూచికబోర్డులను ఏర్పాటు చేసి సదరు పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలన్నారు. ఎవరైనా అడవి జంతువుల కొరకు వేటగాళ్ళు వెల్లుతున్నట్లు తెలిసిన వారి మీద క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన శ్రీ వివేకానంద

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో కరెస్పాండెంట్, అధ్యాపక బృందం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఇంటర్ ఫలితాల్లో మురుగానిపల్లిలోని శ్రీవివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమఫలితాలు సాధించిన్నట్లు బుధవారం ఒక ప్రకటనలో కరెస్పాండెంట్లు భాస్కర్ నాయుడు, మహేంద్రకుమార్లు పేర్కొన్నారు. బుధవారం విడుదల చేసిన ఇంటర్ జూనియన్, సీనియర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు సీనియర్ ఎంపిసి విభాగంలో తేజశ్రీ 989, జనని 987, ఛాందినీ 987, మేఘనా 985, పవనేంద్ర 985 సీనియన్ బైపిసి విభాగంలో ప్రత్యూషా 954, ఛార్మీశ్రీ 930, పుష్పలత 917, హేమలత 916 సీనియర్ సిఈసి విభాగంలో సాయి నూషితా చౌదరి 894, విష్ణుష్ 873 సీనియర్ ఎంఈసి నిషా 946, మేఘన 924 అలాగే జూనియన్ ఎంపిసిలో తరుణ్‌కుమార్ 463, పావని 462, హర్షవర్ధన్ 462, సుధా 461, పూజిత 461, ఎన్. పూజిత 460 జూనియర్ బైపిసిలో ఫాతిమా హుస్రా 432, కావేరి 416 జూనియర్ సిఇసి జస్వంత్ 460, లక్ష్మి సాహితీ 447 మార్కులు సాధించారని కళాశాల కరెస్పాండెంట్లు తెలిపారు. ఉత్తమమార్కులు సాధించేందుకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులను కళాశాల కరెస్పాండెంట్లు భాస్కర్ నాయుడు, మహేంద్రకుమార్లు అభినందించారు.

ఉత్తమ ఫలితాలకు నెలవు 'శ్రీ విద్యా వికాస్'

9 నుంచి 11 వరకు ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన శ్రీ విద్యా వికాస్ విద్యార్థులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఉత్తమ ఫలితాలకు నెలవుగా శ్రీవిద్యావికాస్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్‌ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించారని కళాశాల కరెస్పాండెంట్ ప్రకాష్ చంద్రారెడ్డి తెలిపారు. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపిసి నందు దుర్గా శ్రీ 987, హేమలత 983 బైపిసి విభాగంలో జ్ఞాన చందన ప్రియ 983 టాన్ టాఫర్‌గా నిలిచారని పేర్కొన్నారు. సీనియర్ సిఇసి విభాగంలో వేదయాని 955 ప్రథమస్థానంలో నిలిచారని అలాగే ప్రథమ సంవత్సరం ఎంపిసి విభాగంలో మౌనిక 470 ప్రథమ స్థానం సాధించారని పేర్కొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'విజయం' విజయభేరి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్
బుధవారం విడదల చేసిన ఇంటర్ ఫలితాల్లో విజయం విద్యార్థులు విజయభేరి మ్రోగించిన్నట్లున విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ ఎంపిసి నందు తనుషా 982, చైతన్య 980, హర్షవర్ధన్ 980, కీర్త 978, హర్షవర్ధన్ 978 సీనియర్ బైపిసిలో నందిన 983, చందనా 969 లోహిత్ 968 సినియర్ ఎంఈసిలో త్రివేణి 983, రమ్యశ్రీ 978 సినియర్ సిఇసి హర్షిత 971, కుషల్లో పర్వీన్ 968, లోకేష్ 965 జూనియర్ ఎంపిసిలో తనుశ్రీ 459, లీనా 459, జగదీష్ చంద్రప్రసాద్ 457, విశ్వజిత్ 455, బైపిసి సౌమ్య 411, భవ్యశ్రీ 466, సింధు 465 సిఇసి అనిల్ 469, తనుశ్రీ 455, మౌనిక 452 మార్కులు సాధించారని పేర్కొన్నారు. అలాగే ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 950 కంటే ఎక్కువ మార్కులు 42 మంది సాధించగా 900 మార్కులు కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారిలో 113 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సర ఫలితాల్లో 450 కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారిలో 46 మంది. 400 మార్కుల కంటే అధికంగా మార్కులు సాధించిన వారిలో 124 మంది విద్యార్థులు తమ కళాశాల విద్యార్థులు సాధించారని తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడంతో తమ కళాశాల అనురిస్తున్న ఉన్నతమైన విద్యాప్రమాణాలు, బోధన ప్రణాళికలే కారణమని విజయం విద్యాసంస్థల అధినేత డాక్టర్ తేజోమూర్తి తెలిపారు.

ఉత్తమ మార్కులు సాధించిన విజయం జూనియర్ కళాశాల విద్యార్థులు

ఇంటర్ ఫలితాల్లో అబ్బురపరచిన 'ఆర్‌కె'

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రమేష్‌బాబు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఇంటర్ ఫలితాల్లో రుక్మిణీ కృష్ణస్వామి జూనియర్ కళాశాల విద్యార్థులు అబ్బురపరిచేలా ఫలితాలు సాధించారని కళాశాల కరెస్పాండెంట్ డికె.బద్రీనారాయణ తెలిపారు. చక్కటి వాతావరణంలో అనుభవం కలిగిన అధ్యాకులచే విద్యార్థిని విద్యార్థులకు ఉత్తమబోధన అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఆర్‌కె జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. సీనియర్ ఎంపిసి నందు తనూజరెడ్డి 989 రాష్ట్రస్థాయిలో టాప్‌ర్యాంక్, లక్ష్మీప్రియ 980, మేఘనా 977, మానస 976, సోషియా 971, దీప్తి 968 సీనియర్ ఎంఈసిలో విష్ణు 981 రాష్ట్ర స్థాయిలో టాప్ మార్కులు సాధించారు. పావ్య 981, ఉదయశ్రీ 978, హర్షిత 977, రీతూశ్రీ 973, హరికా 969 సీనియర్ సిఇసిలో జయంతి 944 సీనియర్ బైపిసిలో అమ్రీన్ 952, దేవేంద్రన్ 948, సౌమ్య 943 జూనియన్ ఎంపిసి జోషిత 46, మోనికా శ్రీ 460, సుష్మిత 457, గాయత్రి 453, రజియా భాను 453, హంసవేణి 452 అప్సనా 451 జూనియన్ ఎంఇసిలో చేతన్ 484, హేమంత్ 484, రామ్‌చరణ్‌రెడ్డి 478, తేజస్విని 475, కార్తీక్‌ప్రియ 472 మార్కులు సాధించారని ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కరెస్పాండెంట్ బద్రినారాయణ, ప్రిన్సిపాల్ రమేష్‌బాబులు అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో ...

పిఎస్‌ఎన్ శ్రీ వివేకానంద విజయకేతనం

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కరెస్పాండెంట్లు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: బుధవారం విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో శ్రీవివేకానంద (పిఎస్‌ఎన్) విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కళాశాల కరెస్పాండెంట్లు పి.సత్యనారాయణ, నాగరాజశెట్టిలు తెలిపారు. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో హర్షిత 990, తేజస్వీ 985, సాయి తేజారెడ్డి 985, నితిన్ 984, చందన 983, తేజా 981, జ్ఞానసాయి 981, హేమత్ సీనియర్ బైపిసీ విభాగంలో గీతశ్రీ 983 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపిసి ఫలితాల్లో నిహిత 466, పవన్ 465, రితీక్‌రాజ్ 465, చాందినీ 464 మార్కులు సాధించి తమ కళాశాల విద్యాబోధనకు తార్కారంగా నిలిచారని కరెస్పాండెంట్లు తెలిపారు. ఇంటర్ జూనియర్, సీనియర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించేలా చక్కటి విద్యాబోధన చేసిన అధ్యాపక బృందాన్ని అభినందించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కరెస్పాండెంట్లు అభినందించారు. తల్లిదండ్రుల సహకారం, అధ్యాపకుల క్రమశిక్షణతో ఉత్తమ ఫలితాలు సాధించిన్నట్లు విద్యార్థినీ, విద్యార్థులు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

దేవాలయాల్లో చోరీ చేస్తున్న ముఠా అరెస్ట్

రూ.5 లక్షల విలువైన బంగారు నగదు స్వాధీనం

చోరీకి పాల్పడిన ముఠాను, స్వాధీనం చేసుకున్న నగలు చూపుతున్న డిఎస్పీ

ప్రజాశక్తి- గంగవరం: దేవాలయాల్లో చోరీచేస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు డిఎస్పి సుధాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం గంగవరం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పీ మాట్లాడారు. గత కొన్ని రోజులుగా చుట్టుపక్కల మండలాలలో ఉన్న దేవాలయాల్లో రాత్రివేళల్లో చోరీలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో పోలీసులు రంగంలోకి దిగి నలుగురును దొంగలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిలో చౌడేపల్లి, పెద్దపంజాణి, గంగవరం మండలానికి చెందిన లోకేష్, శశికుమార్, మార్కండేయతో పాటు ఒక మైనర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. చోరీలో విగ్రహాలకు అమర్చుతున్న బంగారు నగలు సెటగోపాలు కలిపి సుమారు ఐదు లక్షల రూపాయలు విలువ చేసి ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పై ప్రతాపరెడ్డి పాల్గొన్నట్లు తెలియజేశారు.

2400 లీటర్ల నాటు సారా ఊట ధ్వంసం

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్ళపల్లి అటవీ ప్రాంతంలో ఎస్పై లోకేష్ తమ సిబ్బందితో కలసి నాటుసారా స్థావరాలపై దాడులు చేశారు. బుధవారం అందిన సమాచారం మేరకు పెరుమాళ్ళపల్లె అటవీ ప్రాంతంలో సోదాలు నిర్వహించారు. ఓప్రాంతంలో 2400 లీటర్ల నాటు సారా ఊట గుర్తించి ధ్వంసం చేశారు. నాటుసారా తయారీకి ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలు ఎవరు చేయరాదని, గ్రామస్తులకు తెలియజేశారు ఎవరైనా పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విట్ 2023 ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన

శ్రీ వివేకానంద విద్యార్థులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: బుధవారం ప్రకటించిన విట్ 2023 వార్షిక ఫలితాల్లో శ్రీవివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమప్రతిభ కనబరిచారని కళాశాల కరస్పాండెంట్స్ సత్యనారాయణ, నాగరాజు శెట్టి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ కళాశాలకు చెందిన విద్యార్థులు సాయితేజ రెడ్డి 1984 ఆల్ ఇండియా ర్యాంకు సాధించగా నితిన్ 5231 ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులను కరస్పాండెంట్లు అభినందించారు.



ర్యాంకు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

'విజ్ఞాన్'లో 80 శాతం ఫలితాలు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: జూనియర్ కళాశాలలో 80శాతం కళాశాల కరస్పాండెంట్ వెంకటాచలం తెలిపారు. మొదటి సంవత్సరం సీఈసీ హాలియా ఫైరోజ్ 467, ఎంపీసీ రాజరాజేశ్వరి 385, ద్వితీయ సంవత్సరంలో సిఇసి నందిని 838, బైపిసి జ్యోతిక, బుజ్జి 805, ఎంపీసీలో హన్సిక 818మార్కులతో కళాశాల మొదటిస్థానాన్ని కైవసం చేసుకున్నారని తెలిపారు. మొదటి సంవత్సరంలో 60 శాతం ఉత్తీర్ణత సాధించి మండలంలోని ఉత్తమ కళాశాలగా పేరు తెచ్చుకుంటుందన్నారు. జూనియర్ కళాశాలకు అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఆసక్తిగల విద్యార్థులు అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆల్ ఇండియా చిత్రలేఖన పోటీలో

గిరిజన సంక్షేమ పాఠశాల బాలికల ప్రతిభ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆల్ ఇండియా యూత్ అండ్ చిల్డ్రన్ చిత్రలేఖన పోటీల్లో సాధించిన బంగారు, కాంస్య పథకాలు, మెరిట్ పథకాలు సాధించిన గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ రేఖ, రేవతి అభినందించారు. గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థినులు తమ చిత్రలేఖన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ, తమదైన శైలిలో ప్రతిభ కనబరిచారని అన్నారు. 2023 సంవత్సరానికి గాను విజయవాడలోజరిగిన 10వ అల్ ఇండియా చిల్డ్రన్ అండ్ యూత్ ఆర్ట్స్ కమ్ ప్రదర్శనలో చిత్తూరు గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల విద్యార్థులు వేసిన చిత్రలేఖనాలలో తమ విద్యార్థులు ప్రతిభ కనపరిచారని అన్నారు. విజయవాడలో జరిగిన పోటీలో పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని ఎం. కుసుమ, సత్య విద్యార్థిని చిత్రలేఖన పోటీలో బంగారు పథకాన్ని జాహ్నవి, నాగమ్మ వెండి పథకాలు సాధించారు. ఈ చిత్రలేఖన పోటీల్లో తమ పాఠశాలవిద్యార్థినులు 17మంది మెరిట్ సర్టిఫికెట్ను సాధించంతో రాష్ట్ర, జిల్లా స్థాయిలో కూడా తమ పాఠశాల పేరు మారుమోగుతూ ఉందన్నారు. ఇలాంటి పోటీల్లో విద్యార్థినులకు తర్ఫీదు ఇచ్చిన డ్రాయింగ్ టీచర్ కె.రేవతిని విద్యార్థినులను ప్రిన్సిపల్ రేఖ అభినందించారు.

విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రేఖ

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : చిత్తూరు జిల్లా ఎస్పీ వై.రిశాంత్ రెడ్డి ఆదేశానుసారం శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేదిలేదని డిఎస్‌పి శ్రీనివాసమూర్తి తెలిపారు. డిఎస్‌పి మాట్లాడుతూ నగరంలోని ప్రజలు శాంతికాముకులని, ప్రశాంతతకు భంగం వాటిల్లే విధంగా లేదా నగర ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదన్నారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలు, సెటిల్‌మెంట్లు, దందాలు, కొట్లాటలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. చెడు అలవాట్లు, నేరప్రవత్తిని విడిచిపెట్టి సమాజంలో మంచిగా జీవించడం నేర్చుకోవాలన్నారు. రౌడీషీటర్లపై పీడీయాక్టు ఉపయోగించి ఉక్కుపాదం మోపుతానన్నారు. రౌడీ షీటర్లతో పోలీస్‌స్టేషన్ పరిధిలో సమావేశం ఏర్పాటు చేసి కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించాలన్నారు. ప్రతిఒక్క రౌడీషీటర్ల లేటెస్ట్ పాస్‌పోర్టు సైజ్ ఫోటో, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, వత్తి వివరాలను తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. మాట వినకపోతే నగర భహిష్కరణ కూడా చేస్తామని హెచ్చరించారు. అక్రమ మద్యం, ఇసుక రవాణపై ప్రత్యేక నిఘా ఉంచి అక్రమ రవాణ చేసే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేసారు.

చిత్తూరు డిఎస్‌పి శ్రీనివాసమూర్తి

టూరిజం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చారిత్రాత్మకమైన చిత్తూరు జిల్లాలో టూరిజం అభివద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ అన్నారు. జిల్లా కలెక్టర్ టూరిజం అధికారులతో బుధవారం సాయంత్రం సమావేశం అయ్యారు. ఈసందర్భంగా జిల్లాలో మొత్తం నాలుగు టూరిజం కేంద్రాలు ఉన్నాయని పులిగుండులో మాత్రం ప్రస్తుతం రిసార్ట్స్ నడుస్తోందని మిగతా ప్రాంతాల్లో మెయింటెనెన్స్ నిర్వహిస్తున్నారని తెలిపారు. బోయకొండ వద్ద టూరిజం కేంద్రం ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఇంకా కొత్తప్రాజెక్ట్ ఏవైనా ఉంటే ప్రతిపాదనలు చేయాలన్నారు. చిత్తూరు సమీపంలోని తిమ్మసముద్రం, నగిరిలో ప్రతిపాదనలు తయారు చేసినట్లు తెలిపారు. కుప్పం సమీపంలోని ననియాల ఎలిఫెంట్ పార్కు సంబంధించి పనులను ఏ విధంగా నిర్వహిస్తున్నారనికలెక్టర్ టూరిజం అధికారులను అడిగారు. ఇంకా గుడివంక పలమనేరులోని బాపూజీ పార్కు గుండుబావిలలో నిర్వహణ గురించి అడిగారు. కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో క్షేత్రస్థాయి పర్యటన చేసిన తర్వాత తగు నిర్ణయం తీసుకొని ప్రతిపాదనలు పంపడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, జిల్లా టూరిజం అధికారి రూపేంద్ర కుమార్‌రెడ్డి, డివిజనల్ మేనేజర్ గిరిధర్ పాల్గొన్నారు.

టూరిజం అభివృద్ధి పై అధికారులతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్

సంక్షిప్త వార్తలు

ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి- కార్వేటినగరం: గ్రామాల్లో ఆధ్యాత్మకతను పెంపొందించేందుకే గ్రామాల్లో హిందూ ఆలయాలను నిర్మాణం చేపడుతున్నామని ఎండోమెంట్ డీఈ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మండలంలో 25 ఆలయాల నిర్మాణానికి గ్రామాల్లో పర్యటించి స్థలపరిశీలన చేశారు. ఈసందర్భంగా ఎండోమెంట్ ఈవో మాట్లాడుతూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి చొరవతో మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ గ్రామాల్లో ఒక్కో ఆలయానికి రూ.10లక్షల చొప్పున 25 గ్రామాల్లో టీటీడీ వారి ఆధ్వర్యంలో శ్రీకష్ణ ఆలయాలు, శ్రీరాములవారి ఆలయాలను నిర్మాణం చేయడానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అనంతరం ఆలయాలు మంజూరైన గ్రామాల్లో పర్యటించి స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ లతబాలాజీ, మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, ధనంజయ వర్మ, ఏఎంసి డైరెక్టర్ ఆకులగోపి, జయపాల్, శేషాద్రి, కుప్పారెడ్డి, వీరస్వామి యాదవ్, చందురాజు, ధన్‌రాజ్, రాజారాం, వైస్‌సర్పంచ్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

సచివాలయాల్ని తనిఖీ చేసిన ఎంపీడీవో

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: మండలంలోని రెండు పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రాలను, సచివాలయాలను ఎంపీడీవో శ్రీదేవి తనిఖీ చేశారు. గంగాధర నెల్లూరు మండలం వెజ్జుపల్లి, నెల్లేపల్లి పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రాలను, అదేవిధంగా గ్రామ సచివాలయాలను బుధవారం ఎంపీడీవో తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయరాబడిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నెల్లేపల్లి, వెజ్జుపల్లె సర్పంచ్‌లు రవీంద్రారెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, మండల పరిషత్ ఏవో సుధాకర్, ఈవోపిఆర్డి శివయ్య, పంచాయతీ కార్యదర్శులు రవీంద్ర, ప్రశాంత్ పాల్గొన్నారు.

పాఠశాల ప్రగతిని యాప్‌లో నమోదు చేయాలి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: పాఠశాల ప్రగతిని ఫోన్‌యాప్‌లో నమోదు చేయాలని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పివిఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠశాల ప్రగతి ఎవాల్యూషన్ టూల్ పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలలో సోషల్ ఆడిట్ ప్రధానోపాధ్యాయులు వివరించాలని పాఠశాలస్థాయి పాఠశాల కమిటీ చైర్మన్‌కు తల్లిదండ్రుల కమిటీ సభ్యులకు శిక్షణ ఇచ్చి సోషల్ ఆడిట్ మొబైల్ యాప్‌లో పూర్తిచేయాలన్నారు. హెచ్‌ఎంలు వెంటనే తేదీ 27వ తేదీ నుంచి పాఠశాలస్థాయిలో తల్లిదండ్రుల కమీటీ సభ్యులకు శిక్షణ ఇచ్చిన తరువాత పాఠశాల సోషల్ ఆడిట్‌ను మొబైల్ యాప్ పూర్తి చేయాలన్నారు. జిల్లా రీసెర్చ్ పర్సన్స్ గిరిబాబు శశికుమార్, మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత ఎయిడెడ్, గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిఆర్‌పిలు, డేటా ఆపరేటర్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్, తదితరులు పాల్గొన్నారు.

షాదీ మహల్‌కు బోరు మోటర్ అందజేత

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలం కేంద్రంలోని ఉర్దూ షాదీ మహల్‌కు బుధవారం బోరు మోటర్ ఉచితంగా మొగసాల బ్రదర్స్ అదజేశారు. ఈ సందర్భంగా ముస్లిం, మైనార్టీ నాయకులు మాట్లాడుతూ షాదీ మహల్‌లో ముస్లిం, మైనార్టీల వివాహాలు జరిగినప్పుడు తాగునీటి సమస్యలు ఎక్కువగా ఉందని బోరుమోటర్ ఏర్పాటు చేయాలని మొగసాల బ్రదర్స్‌ను కోరడంతో వారు స్పందించి బోరు మోటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి మొగసాల కృష్ణమూర్తి, ఎంపిపి సంఘ అధ్యక్షులు మొగసాల రెడ్డప్ప, రెడ్డి వీనస్, శైలేష్, సర్పంచ్ వెంకటేష్, ఉపసర్పంచ్ తబ్రిజ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఆదేశాలు



ప్రజాశక్తి- వికోట: రాష్ట్రంలోని ప్రజలందరికీ అభివద్ధి సంక్షేమ పథకాలు అందించడంలో దేశానికి ఆదర్శంగా నిలిచిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని పలమనేరు ఎమ్మెల్యే వెంకటే గౌడ ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని ముదరందొడ్డి సచివాలయం పరిధిలోని గూబలబండ, ముధరందొడ్డి గ్రామాల పరిధిలో గడపగడపకు మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ బుధవారం పర్యటించారు. ప్రతి గడపకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుని ప్రభుత్వపరంగా అందుతున్న అభివద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను వారికి అందజేశారు. ప్రజల నుండి అందిన పలు సమస్యలను సత్వారం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్, జిల్లా పరిషత్ సలహా మండలి సభ్యులు గౌస్, వైస్‌ఎంపీపీ లక్ష్మణ్ రెడ్డి, స్థానిక సర్పంచ్ దామోదర్, సింగిల్ విండో అధ్యక్షులు గోపిరెడ్డి, రెస్కో డైరెక్టర్ భూపతి పాల్గొన్నారు.

మహేష్‌బాబుకు ఘనసన్మానం

ప్రజాశక్తి -పాలసముద్రం: మండలంలోని కావేరాజపురం పంచాయతీ సర్పంచ్ గాలి మహేష్‌బాబుని మాజీ ఎస్‌టియు మండల అధ్యక్షుడు పీతాంబరరాజు బుధవారం ఘనంగా సన్మానించారు. పీతాంబర రాజు మాట్లాడుతూ గాలి మహేష్ బాబు పంచాయతీలో చేస్తున్న అభివద్ధి పనులకుగాను సర్పంచ్‌గా గుర్తించి కలెక్టర్, జడ్పీ చైర్మన్ చేతుల మీదుగా అవార్డు అందించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పూలమాలలు వేసి దశ్యాలతో సత్కరించారు. పంచాయతీ కార్యదర్శి రాజకుమార్, ప్రధానోపాధ్యాయురాలు శ్యామల, వాలంటీర్లు, సచివాలయ సిబ్బందిని పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - కార్వేటినగరం : నాడు-నేడు పథకంలో రెండో విడత మంజూరైన పాఠశాలల నిర్మాణాల పనులను వేగవంతం చేయాలని జిల్లా సమగ్ర శిక్షణా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ వెంకట రమణారెడ్డి అన్నారు. బుధవారం ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులపై ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి నాడు-నేడు కింద పనులు జరుగుతున్న పాఠశాలల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. నాడు- నేడుకు పాఠశాలలకు తాగునీరు, విద్యుత్ పనులు, మేజర్, మైనర్ మరమ్మతుల పనులకు నిధులు సిద్ధంగా ఉందని, బిల్లులకోసం పనులను నిలిపి వేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలల్లోను రన్నింగ్ వాటర్‌తో కూడిన మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టాలని సూచించారు. పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులపై సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని, లోపాలను గుర్తించి నాణ్యతతో కూడిన నిర్మాణాలతో పూర్తి చేయాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి ఎం.విజయ కుమార్, ఏఈ నాగభూషణం, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

జూన్ లోపు పనులను పూర్తి చేయండి: ఎంపిడిఒ

ప్రజాశక్తి -సోమల: మండలంలో నాడు-నేడు పేస్‌టు కింద పాఠశాలల్లో చేపట్టిన అభివద్ధి పనులను వేగవంతం చేసి జూన్ మాసంలోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల అభివద్ధి అధికారి నాగరాజు కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలోని సమావేశపు గదిలో రెండవ విడత నాడు-నేడు పనులు మంజూరైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పనులు ప్రారంభించిన వారు ప్రభుత్వం నుంచి అందుతున్న రివాల్వింగ్ ఫండ్ నిధులను త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు ఖర్చు చేయాలని జూన్ మాసంలోపు పనులను పూర్తిచేయాలని ప్రధానోపాధ్యాయులను కోరారు. రెండవ విడత నాడు- నేడు పనుల కింద 28 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఒక జూనియర్ కళాశాలకు అభివద్ధి పనుల ఆదేశాలు మంజూరయ్యాయని కావున ఆయా పాఠశాలలు కళాశాలలో పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. ఉన్నత పాఠశాల, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాల క్లర్క్ పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కార్యక్రమం ప్రారంభం

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండలంలో ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో భౌతిక శ్రీనివాస్ విశ్వనాథ్ అన్నారు. కొత్త ఆధార్ నమోదు, ఉన్న ఆధార్ కార్డులో వివరాలు మార్పులు చేర్పులు చేసుకునేవారు ఆధార్ నమోదును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 0 నుండి 5 సంవత్సరాల పిల్లల ఆధార్ నమోదు కోసం ఈ ప్రత్యేకశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో చాలామంది చిన్నారులు ఆధార్ నమోదు చేయించుకోలేదని, వారి సౌలభ్యం కోసం ప్రత్యేక ఆధార్ శిభిరాన్ని పెద్దపంజాణి గ్రామంపరిదిలో తేది 27వ తేదీ గురువారం ఏర్పాటు చేసామని, ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అభివద్ధి అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ సూచించారు. పెద్దపంజాణి గ్రామ పంచాయతీ పరిధిలో పెద్దపంజాణి, భద్రాచలం, పంజాణిసత్రం, గ్రామ సచివాలయంలో ఉదయం 7గంటల నుంచి ఆధార్ నమోదు ఉంటుందని ఎంపిడిఓ అన్నారు. ఆధార్ శిబిరానికి వచ్చేవారు పిల్లల జనన ధవీకరణ పత్రం, తల్లిదండ్రుల ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. పెద్దపంజాణి సచివాలయం గ్రామ కార్యదర్శి సుబ్రహ్మణ్యం వెల్ఫేర్ అసిస్టెంట్ గణేష్, డిజిటల్ అసిస్టెంట్ అఖిల, సిబ్బందికి ఆధార్ నమోదుపై సూచనలు చేశారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రవిరాజు

ప్రజాశక్తి- కార్వేటినగరం: రానున్న వేసవి దృష్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రవిరాజు అన్నారు. సిహెచ్‌సిలో ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్లు రోజు అందుబాటులో ఉండి రోగులకు సహకరించాలని, సిహెచ్‌సిలో ఓపిలను పెంచాలని డాక్టర్లను ఆదేశించారు. టిబీ నియంత్రణకు ప్రభుత్వం కషి చేస్తుందని, డాక్టర్లు సిబ్బంది టిబీ రోగులను గుర్తించి నియంత్రణకు తెలిపారు. వేసవి నేపథ్యంలో మంచినీళ్లు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలని పేర్కొన్నారు. హాస్పిటల్లో రక్తపరీక్షలు సరిగ్గా చేయడంలేదని డాక్టర్లు, సిబ్బంది మీద అసహనం వ్యక్తం చేశారు. సిహెచ్‌సిలోని ఆపరేషన్లు చేయాలని, రెఫర్లు చేయకూడదని పేర్కొన్నారు. రాత్రిపూట కూడా డాక్టర్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఇంకోసారి విసిటింగ్ వచ్చినప్పుడు ఓపిల సంఖ్య పెరగాలనానరు. అదేవిధంగా డెంగ్యూ, మలేరియా విషజ్వరాలు వస్తే సిహెచ్సిలోనే చూసుకోవాలని తెలిపారు. డాక్టర్ మురళి, గోపీనాథ్,లక్ష్మీపతి, శతి, పలువురు ఉన్నారు.